హైదరాబాద్ వార్త



# స్కూల్స్ ఓపెన్



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్(టీటీఐ) ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతున్న సీఐ నాగుల అశోక్.



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న టీచర్లు,సిబ్బంది

**హైదరాబాద్, జూన్ 15 ప్రభాతవార్త:** నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మళ్లి తెరుచుకున్నాయి. పాఠశాలలు విద్యార్థులలో కళకళలాడుతున్నాయి. సోమవారం పాఠశాలలు తెరిచిప్పటికి చాలా వరకు విద్యార్థులు పాఠశాలలకు హాజరుకాలేదు. దాదాపు నెలన్నరకు పైగా వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలు విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తోంది. వేసవి సెలవుల తరువాత పాఠశాలల సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలికినట్లుగా ఉంది. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్లు ఎంతమాత్రం శుభ్రతలేని పరిస్థితిలో పాఠశాలల పునః ప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. పాఠశాలలు ప్రారంభం కాకముందే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం సిద్దంగా ఉంటాయని అధికారులు చెప్పినప్పటికి అవి వాస్తవరూపం దాల్చడంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2,557 ప్రభుత్వ పాఠశాలలు, 4,667 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు అవసరమైన 8,49,100 పాఠ్య పుస్తకాలకు, 2,71,592 నోట్ బుక్స్‌కోసం ఇండెంట్ పెట్టారు. కాని వాటిలో పాఠశాలలు తెరిచే సమయానికి 8,30,370 పాఠ్యపుస్తకాలు,2,59,322 నోట్ బుక్స్ మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. అలాగే ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫాంలు మాత్రం అందలేదు.

**సమస్యల వలయంలో పాఠశాలలు...**

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు ఒకలా ఉంటే ప్రభుత్వ పాఠశాలల సమస్యలు మరోలా ఉన్నాయి. కనీస సౌకర్యాలు కూడా లేకుండా అనేక పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో కూడా సదుపాయాలు కరువై ఇబ్బందులు పడకతప్పని పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలల దయనీయ స్థితిని చూస్తే విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించడం, ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పడం విడ్డూరంగా అనిపిస్తోంది. హయత్‌నగర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్డికి తలుపులు లేకపోవడంతో ఫ్లెక్సీని అడ్డుగా పెట్టుకొని ఉపయోగించుకుంటున్నారు. దీంతో మహిళా ఉపాధ్యాయులు, బాలికల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కాని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన వసతులు కల్పించడంలో కళ్లు, చెవులు మూసుకుంటోందని విద్యార్థుల తల్లి, తండ్రులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పాఠశాలలో మా పిల్లలను ఎలా చేరాలని ప్రశ్నిస్తున్నారు. సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు సరిపోక ఉర్దూ మీడియంతో పాటు ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఒకే తరగతిలో కూర్చోవాల్సి వస్తోంది. ఇక్కడ ఫ్యాన్‌లు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. పాఠశాలలో తాగు నీటి సౌకర్యం లేకపోవడంతోపాటు మరు గుదొడ్లు, మూత్రశాల లను ఇప్పటివరకు శుభ్రం చేయని పరిస్థితి నెలకొంది. చిలకలగూడ దూద్ బావి, సీతాఫల్‌మండి బ్రాహ్మిణబస్తీ (గుడిసే స్కూల్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో వాష్ రూమ్‌లకు తలుపులు విరిగిపోయి ఉన్నాయి. సీతాఫల్‌మండి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉండగా ఇందులోనే దశాబ్దం కిందట జూనియర్, డిగ్రీ కాలేజీలను కూడా ఏర్పాటు చేశారు. మూడు సంవత్సరాల కిందట రూ. 30కోట్లు ఖర్చుతో నూతన భవనం నిర్మిస్తున్నామని ఉన్న భవనాన్ని కూల్చివేశారు. ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదు. మరో ఐదు సంవత్సరాలు గడిచినా పూర్తవుతుందనే నమ్మకం లేని పరిస్థితి. తాజాగా తెలిసిన విషయం ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని. ప్రభుత్వ పాఠశాలలు అనగానే చెత్తచెదారంతో నిండిన ప్రాంగణాలు, తరగతి గదులు, మాసిపోయి, చిరిగిపోయిన దుస్తులతో పాఠశాలకు వచ్చే విద్యార్థులుగానే కనిపిస్తుండడంతో పిల్లలను పాఠశాలల్లో చేర్చడానికి తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. ఆర్థికంగా భారం అయినప్పటికి సాధారణ ఖర్చులను తగ్గించుకొని ప్రైవేట్ పాఠశాలల వేపు మొగ్గ చూపుతున్నారు.

## సర్ విషయంలో అప్రమత్తంగా ఉండండి : ఎమ్మెల్యే దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, జూన్ 15, ప్రభాతవార్తః** ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని వైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి సర్ తీరుతెన్నుల గురించి చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలు మంజూరయ్యాయని, అధికారులు నిరక్ష్యంతో అవి ముందుకు సాగడం లేదన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 13 నుంచి ప్రవహించే నాలా కారణంగా ముంపు సమస్య తలెత్తుడటంతో విడతల వారిగా సుమారు రూ. 1.40 కోట్ల రూపాయలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రెండు నెలల క్రితం పనులు ప్రారంభోత్సవం చేసినప్పటికి పనులు ఇంకా మొదలు కాలేదన్నారు. వర్షాలు పడేలోపు సమస్య పరిష్కారం అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా పని జరగడం లేదన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ఎన్బీటీనగర్లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం నిధులు మంజూరయినప్పటికి పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రతి డివిజన్లో ఇలా అనేక పెండింగ్ పనులు ఉన్నాయని వీటిని వేగవంతం చేసేందుకు శాఖల వారిగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. అప్పటి వరకు కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ వారి సమస్యల విషయంలో స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఓటరు జాబితా సవరణ విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో ఎవరి ఓటు పోకుండా బీఎల్‌ఏలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, డివిజన్ల వారిగా బీఎల్‌ఏ జాబితా సిద్ధం చేయాలని ఇంచార్జిలను ఆదేశించారు. బీఎల్‌ఏలకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్, భారతీనాయక్, నాయకులు మామిడి నర్సింగరావు, రాములు చౌహాన్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం, చిత్రంలో మామిడి నర్సింగ్‌రావు, రాములుచౌహాన్ తదితరులున్నారు.

**చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14 నంది నగర్ గ్రౌండ్లో వెంకటేశ్వనగర్ కాలనీ, సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్లకు చెందిన 54 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే దానం పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### మియాపూర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

**గచ్చిబౌలి, జూన్ 15 ప్రభాతవార్త :** మియాపూర్‌లో భవనంపై నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య కేసులో భర్తపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈసంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మియాపూర్ మయూరినగర్‌లో ఈషాసాహు(37), భూపేంద్ర సాహు భార్య, భర్తలు తమ ఇద్దరు కుమార్తెలు విధి,వాణిలతో కలిసి నివాసం ఉండేవారు. రెండవ కుమార్తె పుట్టినప్పటి నుంచి భూపేంద్ర సాహు భార్యను వేధించసాగాడు. తనకు రెండవసారి సైతం కుమార్తె పుట్టడం ఇష్టం లేదని భార్య ఈషాసాహును మానసికంగా వేధిం చసాగాడు. ఈ క్రమంలో జూన్ 12వ తేదీన పెద్దకుమార్తెను తీసుకొని భూపేంద్ర సాహు బయటకు వెళ్లగా, ఈషా సాహు తన చిన్నకుమా ర్తెతో తాము నివాసం ఉంటున్న అపార్టుమెంటు 6వ అంతస్థు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. తీవ్ర గాయాలతో ఈషా సాహు అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తెకు గాయాలయ్యాయి. దీంతో మృ తురాలి తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమో దు చేసుకోగా, ఈషా సాహును వేధింపులకు గురిచేసిన భర్త భూపేంద్ర సాహును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### రూ.25 లక్షలు పెట్టి కొన్న కారు గంటల్లోనే బ్రేక్‌డౌన్

**రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో బాధితుడి పిర్యాదు**

**గచ్చిబౌలి, జూన్ 15 ప్రభాతవార్త**

లక్షలు వెచ్చించి కొన్న కొత్తకారు పది కిలోమీటర్లు సైతం వెళ్లకముందే బ్రేక్‌డౌన్ కావడం సంచలనంగా మారింది. బాధితుడు కారు కొనుగోలు చేసిన షోరూమ్‌ను సంప్రదిస్తే సరైన స్పందన లేకపోవడంతో తెలంగాణ వినియోగదారుల ఫోరంను, రాయదుర్గం పోలీసులను ఆశ్రయించి పిర్యాదు చేశాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఐటి కారిడార్ పరిధిలోని మైహోం అవతార్‌లో నివాసం ఉండే యండమూరి ప్రకాశరావు జూన్ 2వ తేదీన రాయదుర్గంలోని నానిష్ అటోమొబైల్స్ షోరూంలో విన్‌ఫాస్ట్ ఎలక్ట్రిక్ కారు కొనుగోలు చేశాడు. మొత్తం 24.69లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కారును షోరూం నిర్వాహకులు డెలివరీ చేసిన అనంతరం బయటకు వచ్చిన ప్రకాశరావు కొద్దిదూరం వెళ్లిన వెంటనే కారు బ్రేక్‌డౌన్ అయ్యింది. కారు ఎంతకూ స్టార్ట్ కాకపోవడంతో తిరిగి షోరూంకు వచ్చి పిర్యాదు చేశాడు. కాగా ఈ పిర్యాదుపై షోరూం నిర్వాహకుల నుంచి సరైన స్పందన లేకపోగా, గట్టిగా నిలదీసిన ప్రకాశ్‌రావు పట్ల అమర్యాదగా ప్రవర్తించారు. దీంతో పలుమార్లు ఈమేయిల్ ద్వారా విన్‌ఫాస్ట్ సంస్థకు పిర్యాదు చేసినా స్పం దన లేకపోవడంతో ప్రకాశ్‌రావు తెలంగాణ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. దీంతో పాటు సోమవారం రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో సైతం పిర్యాదు చేశాడు. తనకు ఫిట్‌నెస్ లేని వాహనం అప్పగించి ఇబ్బందులకు గురిచేశారని వాపోయాడు. ఈ విషయమై బాధి తుడి నుంచి పిర్యాదు అందుకున్న రాయుదర్గం పోలీసులు విచారణ చేపట్టారు.

## వర్షాకాల సన్నద్ధతపై ఎంఎంసి కమిషనర్ సమీక్ష



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 15 ప్రభాతవార్త :** వర్షాకాల నేపథ్యంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి సోమవారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వర్షపాతం, వాతావరణ మార్పులపై రియల్ టైమ్ సమాచారాన్ని అందించే విధానంపై అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వగా, మున్సిపల్ కంట్రోల్ రూమ్ ద్వారా వర్షపాతం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ సర్కిల్ వారీగా నివేదికలు అందుబాటులో ఉంచనున్నట్లు కమిషనర్ తెలిపారు. వర్షాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేకుండా నగరాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. అనంతరం బోడుప్పల్ శ్రీనివాస కాలనీ, ఉప్పల్ విజయపురి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సర్వే కాలనీ, ఐడీఏ ఉప్పల్‌లోని డీఎస్ఎల్ అబాకస్ ఐటీ పార్క్, రామంతాపూర్ చర్చి కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు పూర్తిస్థాయి సన్నద్ధతతో ఉండాలని ఆదేశించారు. ఐడీఏ ఉప్పల్‌లోని డీఎస్ఎల్ అబాకస్ ఐటీ పార్క్ సమీపంలో నాలా నీరు రోడ్డుపైకి రావడంపై స్పందించిన కమిషనర్, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రామంతాపూర్ చర్చి కాలనీలో చెత్త పేరుకుపోవడాన్ని గమనించి, అక్రమంగా చెత్త పారవేసేవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పరిశుభ్రత నిర్వహణను మరింత పటిష్టం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా, తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 24 వినతిపత్రాలు అందాయి. వీటిలో ఇంజినీరింగ్ విభాగానికి 9, టౌన్ ప్లానింగ్‌కు 10, శానిటరీకి 2, వెటర్నరీకి 2, అడ్మినిస్ట్రేషన్‌కు ఒక వినతి అందగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగవంతమైన స్పందనతో సేవలు అందించేందుకు ఎంఎంసి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## శ్లాబులు తొలగించి... వరదకు దారి చూపి

- నాలాల్లో పేరుకుపోయిన పూడికతోనే వరద ముప్పు
- ముంపు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన
- శ్లాబులు తొలగించిన చోట గ్రిల్స్ ఏర్పాటుకు ఆదేశం



నాలాపై స్లాబ్‌ను తొలగిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయెల్ డేవిస్

**హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త:** కాలువలపైన వేసిన స్లాబులే వరదకు కారణంగా నగరంలో పరిణమించింది. కనీసం డీ సిల్టింగ్ చేయడానికి కూడా అవకాశం లేకుండా చేయడంతో సమస్యల తీవ్రత పెరుగుతోంది. కొండాపూర్‌లోని జూబ్లీగార్డెన్, శంషాబాద్, అత్తాపూర్, రామ్‌దేవ్‌బాబానగర్ ప్రాంతాల్లో వరద ముప్పనకు నాలాల్లో పేరుకుపోయిన పూడికే ప్రధాన కారణంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటనలో తేలింది. ప్రతి 3 మీటర్లకు వరద కాలువను ఓపెన్ చేసే వ్యవస్థ ఉంటే.. డీసిల్టింగ్ పనులు పూర్తి స్థాయిలో జరిగేవని స్థానిక అధికారులు చెప్పారు. ఈమేరకు ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయెల్ డేవిస్‌తో కలిసి వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. వందల మీటర్ల కొద్దీ స్లాబ్‌లు తెరవడానికి కూడా వీలు లేకుండా మూసేయడంతో లోతట్టు ప్రాంతాలలో పెద్దమొత్తంలో చెత్త పేరుకుపోయి వరద ప్రవాహనాకి ఆటంకాలు ఏర్పడ్డాయనేది అధికారులు నిర్ధారించారు. బొటానికల్ గార్డెన్స్, శ్రీ రాంనగర్, కొండాపూర్ పోలీసు బెటాలియన్ నుంచి భారీగా వచ్చిన వరద మీనాక్షి టవర్స్‌కు చేరువలో ఉన్న మొండికుంటకు చేరాలి. మొండికుంట నిండిన తర్వాత ఔటెలెట్ ద్వార ముల్లకత్వా చెరువులోకి వెళ్లాల్సిన వరద కాలువలు పూర్తిగా పూడుకుపోవడం తో జూబ్లీ గార్డెన్స్ ను వరద ముంచెత్తిందని చెప్పారు.

**స్లాబులు తొలగించి పూడికతీత..**

శనివారం నుంచే జూబ్లీగార్డెన్స్ ప్రాంతంలో నాలాలపై స్లాబులు తొలగించి పూడికను పెద్దయెత్తున హైడ్రా తొలగిస్తోంది. పక్కనే మీనాక్షి అపార్టుమెంట్స్ ఆవరణ నుంచి 2.15 మీటర్ల వైశాల్యంలో వెళ్లాల్సిన వరద కాలువ మీటరున్నరకు కుంచించుకుపోవడమే కాకుండా.. పైపులైను వేయడంతో వరద పోటెత్తుతోందని అధికారులు గుర్తించారు. అలాగే వరద కాలువను నేరుగా మొండికుంట చెరువులోకి వదిలేయకుండా.. మురుగు నీరును డైవర్ట్ చేసేందుకు ఉద్దేశించి చేపట్టిన కాలువల అనుసంధానంలో ఉన్న లోపాలు కూడా వరద పోటెత్తడానికి కారణమైంది. ఈ సమస్యలను ఒకదాని తర్వాత ఒకటి పరిశీలించిన హైడ్రా కమిషనర్ నాలాలపై అవసరమైన మేరకు స్లాబులు తొలగించి పూర్తిగా డీసిల్టింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. డీ సిల్టింగ్ పనులు అయిన తర్వాత ఓపె న్ నాలాలను గ్రిల్స్‌తో మూసేయాలని సూచించారు. ప్రతి 3 మీటర్లకూ తెరచే విధంగా ఈ ఏర్పాట్లుండాలన్నారు.

**శంషాబాద్, అత్తాపూర్‌లోనూ అదే పరిస్థితి..**

కొండాపూర్ జుబ్లీగార్డన్స్‌లోని పరిస్థితే శంషాబాద్, రాందేవ్‌బాబానగర్,అత్తాపూర్ ప్రాంతాల్లో రహదారులు జలమయం అవ్వడానికి ప్రధాన కారణమని అధికారులు నిర్ధారించారు. రాందేవ్ బాబానగర్ వద్ద ఊరకుంటకు వెళ్లాల్సిన వరద నీరు ఇన్‌లెట్లు సరిగా లేకపోవడంతో శంషాభాద్ విమానాశ్రయం రోడ్డులో నీరు నిలిచిపోవడానికి గల కారణమని స్థానిక అధికారులు చెప్పారు. పీవీనరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబరు 265 వద్ద కూడా మీరాలం చెరువులోకి వెళ్లాల్సిన ఇన్‌లెట్లు పూడుకుపోవడంతో సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. ఇక పిల్లర్ నంబరు 191 వద్ద మూసీలోకి వెళ్లాల్సిన వరద కాలువలు కూడా సరిగాలేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఈ మూడు ప్రాంతాల్లో వరద నిలవడానికి వీలు లేదని.. నాలాలు పూడుకు పోతే వెంటనే స్లాబులు తొలగించి.. పనులు చేపట్టాలని హైడ్రా అసెట్ విభాగం ఇన్‌స్పెక్టర్లతో పాటు.. ఆ ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న ఎస్‌వోలను ఆదేశించారు. వారం రోజుల్లో మళ్లీ ఈ ప్రాంతాలను పరిశీలిస్తానని.. అప్పటికి శాశ్వత పరిష్కారం చూపించాలని సూచించారు. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ట్రాఫిక్ పోలీసు విభాగాలు సంయుక్తంగా పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

## కరెంట్ లైన్స్,పోల్స్ఎలా ఉన్నాయ్..?

- గ్రేటర్‌లో సిఎండీ జితేష్ వి పాటిల్ క్షేత్రస్థాయి పర్యటన
- వివిధ సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డిటిఆర్‌లు, పరిశీలన
- వర్షాకాలం విద్యుత్ సిబ్బంది అమ్రత్తంగా ఉండాలని సూచన
- అంతరాయాలు లేకుండా సమస్య ముందస్తుగా గుర్తించాలని ఆదేశం

**హైదరాబాద్,జూన్ 15,ప్రభాతవార్త:** వర్షాకాలంలో నిరంతరాయ,నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ పనిచేస్తుందని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ విపాటిల్ అన్నారు. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "పోల్స్ అండ్ లైన్స్" స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. అందులోభాగంగా ఉదయం గంటలకు సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుండి 11 కేవీ వేణుగోపాల్ నగర్ ఫీడర్ వెంబడి పాదయాత్ర చేస్తూ విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈసందర్భంగా అన్ని సర్కిళ్లలో 33 కేవీ సబ్‌స్టేషన్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డిటిఆర్), ఎల్.టి. నెట్‌వర్క్‌లను సమగ్రంగా తనిఖీ చేసి వర్షాకాలానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నాణ్యత, లైన్ క్లియరెన్స్, నిర్వహణ పనులు, పరికరాల స్థితిగతులు నెట్‌వర్క్ పనితీరును సీఎండీ పరిశీలించారు. విద్యుత్ అంతరాయాలకు దారితీసే సమస్యలను ముందుగానే గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**మున్సూన్ సన్నద్ధతపై సమీక్ష...**

అనంతరం మేడ్చల్, రంగారెడ్డి జోన్‌లలో పర్యటించి మున్సూన్ సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు.వర్షాకాలంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా కొరకు లైన్ క్లియరెన్స్‌లు, ట్రీ ట్రిమ్మింగ్ పనులు, ఫీడర్ల నిర్వ హణ, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత అత్యవసర స్పందన వ్యవస్థలపై సమీక్ష చేపట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్ లైన్లను తాకే చెట్ల కొమ్మలను తొలగించడం ద్వారా షార్ట్ సర్క్యూట్లు, ఫీడర్ ట్రిప్పింగ్‌లు, విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ వ్యవస్థను మరింత భద్రంగా ఉంచడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిఎండీ వెంట కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణి, మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజనీర్ పి.వి. రమేష్, రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్, జనరల్ మేనేజర్ అంజయ్య,సైబర్‌సిటీ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్, సరూర్‌నగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, రాజేంద్రనగర్ డిఈ రత్నాకర్ రావుఇతర అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందికి సూచలను చేస్తున్న సిఎండీ జితేష్ విపాటిల్

## భద్రతా ప్రమాణాలు పాటించని 60 పాఠశాల బస్సులు సీజ్

**- విద్యార్థుల ప్రాణాలకే తొలి ప్రాధాన్యత : ఆర్టీఏ అధికారులు**

**హైదరాబాద్, జూన్ 15 ప్రభాతవార్త :** భద్రతా ప్రమాణాలు పాటించని ప్రైవేటు బడుల బస్సులపై రాష్ట్ర రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సోమవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో ఆర్టీఏ అధికారులు రోడ్లపైకి వచ్చి ప్రైవేటు బడుల బస్సుల తనిఖీల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తొలి రోజే 245 విద్యా సంస్థల వాహనాలపై కేసులు నమోదు చేసి, ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి వచ్చిన 60.బస్సులను సీజ్ చేశామని అధికారులు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా అందులో 23,204 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 2,783బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు తీసుకోవాలని ఆదేశించారు. రవాణా శాఖ నిర్దేశించిన నిబంధనలకు లోబడి ప్రైవేటు బడుల బస్సులు నడుపాలని, లేదంటే చట్ట పరిధిలో కఠినమైన చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రాణాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ బిడ్డలను పంపిస్తున్న బస్సులు కండిషన్‌గా ఉన్నాయా లేదా? సరిపడ సీట్లు ఉన్నాయా? లేవా? అన్నవి చూసుకోవాలని తెలిపారు. ఏమాత్రం అనుమానం వచ్చినా ఆయా బస్సుల్లో మీ బిడ్డలను పంపవద్దని సూచించారు. విద్యా సంస్థల విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వాహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు పూర్తి బాధ్యత యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ లేకుండా, ఓవర్‌లోడు చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేస్తున్నామని వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోటారు వాహన చట్టం ప్రకారం వాహనాల యజమానులు, డ్రైవర్లపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తాము చేపట్టిన ఈ తనిఖీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని రవాణాశాఖ అధికారులు తెలిపారు.

వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిపికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్‌లు ఉన్నాయా?, వాహనాలలో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారా?, డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు, అనుభవం ఉన్నదా?, ఫస్ట్ ఏయిడ్ బాక్స్, ఫైర్ ఎస్సిస్టింగ్ డోర్, ఎమర్జెన్సి ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు ఉన్నాయా? వాహనాల బ్రేకులు, టైర్లు, లైట్లు, యాంత్రిక భాగాలు సక్రమంగా ఉన్నాయా? విద్యార్థుల భద్రత కోసం అటెండర్‌ను నియమించారా? లేదా? అన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ అధికారులు వివరించారు.



రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు బడుల బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారుల దృశ్యం.

## విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి : మహేందర్

గోషామహల్, జూన్ 15(ప్రభాతవార్త): దాదాపు నెలన్నర రోజుల తర్వాత ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కావడంతో నగరంలోని అన్ని వీధులు,రహదారులు పాఠశాల బాల,బాలికలతో కళకళలాడాయి.సోమవారం సుల్తాన్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్‌కుమార్ ప్రభుత్వ పాఠశాల బాలికలకు నోట్స్‌పాఠ్యపుస్తకాలను అందచేశారు.ఈసందర్బంగా ఆర్వీ మహేందర్‌కుమార్‌ను పాఠశాల బాలికలు సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుష్మ, ఉపాధ్యాయులు ,సీనియర్ బిఆర్ఎస్ నాయకులు జి,యాదగిరి,గ్యాంబిల్, చేతన్, ఈశ్వర్,ఆర్.ఏ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఓంప్రకాష్ బిస్వా

గన్‌ఫౌండ్రి, జూన్ 15(ప్రభాతవార్త): స్వచ్ఛ భారత్, భాగంగా క్లీన్ ఇండియా,గ్రీన్ ఇండియా,ఆరోగ్య ఇండియాకార్యక్రమంలో భాగంగా తెలంగాణ బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా ఆద్వర్యంలో గన్‌ఫౌండ్రి డివిజన్‌లో అనేక ప్రాంతాలల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.ఈ ప్రాంతంలో పరిశుభ్రతంగా ఉండే విధంగా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ..దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపులో భాగంగా గన్‌ఫౌండ్రి డివిజన్‌లో స్వచ్ఛభారత్‌కార్యక్రమాన్ని ప్రతినెల నిర్వహించడం జరుగుతుందన్నారు.వర్షాకాలం కావడంతో ప్రజలు ముఖ్యంగాఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారాన్ని వేయవద్దన్నారు.అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంటుందన్నారు. బస్తీలు,కాలనీల ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అంతేకాకుండా మానవ మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమన్నారు.కాలనీలో పార్క్‌ల వద్ద,ఖాళీ స్థలాలవద్ద మొక్కలను పెంచాలన్నారు.మొక్కలు పెంచడం ద్వారా వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బిసి ఏ లోకి రాకుండా చూడాలి



భట్టి విక్రమార్కకు డైరీ అందచేస్తున్న తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నాయకులు

ముషీరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త: ముదిరాజ్‌లను బీసీ డి గ్రూప్ నుంచి బీసీ ఏ లోకి రాకుండా చూడాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షులు అంబటి సుధాకర్ గంగపుత్ర విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి సంఘం డైరీని అందచేసి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందచేశారు. తెలంగాణలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలోకి తీసుకువస్తే గంగపుత్రులను అన్యాయం జరుగుతుందని, దీనిపై అనేక సంవత్సరాలుగా తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం న్యాయ పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. ముదిరాజ్ కులస్థులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేసి, బడ్జెట్ కేటాయించాలని కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని, ఎవరికీ ఎటువంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అంబటి సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటమైసమ్మ ఆలయం వద్ద సిసి రోడ్డు నిర్మాణానికై వినతి



జెడ్సీ సత్యనారాయణకు వినతి పత్రం అందిస్తున్న ఆలయ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, జూన్ 15, ప్రభాతవార్త : జీహెచ్ఎంసి చార్మినార్ జోన్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఆస్థి పన్ను, ఇంజనీరింగ్ సమస్యలపై మూడు ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో అధికారులు దేవజ, మహ్మద్ హమీద్ తదితరులు పాల్గొన్నారు. గౌలిపురా శ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోటమైసమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు ఎర్మని కైలాష్ గంగపుత్ర ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం జెడ్సి సత్యనారాయణను కలిసి ఆలయం వద్ద గల సమస్యలను వివరించారు. ఆలయం ముందు సీసీరోడ్డు ఎత్తైపోయి ఆలయం కిందకై వర్షం నీరు ఆలయం వద్దకు చేరుతుందని, దేవాలయ మార్గంలో విడిసిసి రోడ్డు వేయాలని కోరారు. జెడ్సిని కలిసిన వారిలో ఆలయ ప్రధాన కార్యదర్శి ఎ.మధుసూదన్‌గిరి, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్, కోశాధికారి బి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఇన్‌స్పెక్టర్ సైదులు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,ప్లేట్లు,గ్లాసులు పంపిణీ చేస్తున్న సీఐ సైదులు.

బేగంపేట జూన్ 15,ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని,ప్రతి తల్లి దండ్రి తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు పిలుపు నిచ్చారు.వేసవి అనంతరం పాఠశాల పున; ప్రారంభం రోజున బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఎస్సైషఫీ, ప్రధానోపాధ్యాయులు యాదగిరి,పాఠశాల ఉపాధ్యాయులతో కల్సి పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులకు స్వాగతం పలికారు.విద్యా సంవత్సరానికి సంబంధించిన నూతన పాఠ్యపుస్తకాలను మిత్రుల నుంచి సేకరించిన సుమారు 300స్టీల్ ప్లేట్లు,గ్లాసులను ఇన్స్‌పెక్టర్ సైదులు పంపిణీ చేసారు.ఈ సందర్బంగా ఇన్స్‌పెక్టర్ గత ఏడాది పాఠశాలలో మంచి మార్కులు పొందిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థుల భవిష్యత్ కోసం సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేసి.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని మంచిగా చదవాలన్నారు.నాడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్నారని,ఈ సందర్బంగా సైదులు గుర్తు చేసారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ఉంటారని ఆయన గుర్తు చేసారు. భవిష్యత్‌లో మరింత మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు బాసటగా నిలవాలని సీఐ సైదులు కోరారు.



రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి పరిధిలోని ప్రెస్టీజ్ డ్రీమ్ వ్యాలీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రామ్‌పాల్ జీ సాంగ్వాన్ ఆధ్వర్యంలో గత 16 నెలలుగా జై శ్రీకృష్ణ అన్నదాన సేవ పేరుతో నిరుపేదలకు, బాటసారులకు ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. పేదలకు అల్పాహారం వడ్డిస్తున్న అసోసియేషన్ సభ్యులు సాంగ్వాన్, రామ్‌పాల్ సింగ్, కపిల్ కేడియా,వేణుగోపాల్ జి,అంకిత్గోయల్,మిషరిలాల్ జైన్,ఛోటూరామ్ గోయల్,రాకేష్ అగర్వాల్, అశోక్ సురానా,సుజిత్ సంగ్రామ్,లతా మేడమ్,జుగల్ కిషోర్ మలాని,బిపిన్ జి, నరేష్ అగర్వాల్, దాతలు తదితరులు పాల్గొన్నారు

## దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని అడ్డుకుంటాం : అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఓట్ల దొంగతనాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ వారియర్స్‌ను సిద్ధం చేస్తున్నామని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం ముషీరాబాద్‌లోని మహ్మదీయ ఫంక్షన్‌హాల్ నందు ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎస్ఐఆర్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూతు కమిటీ సభ్యులకు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని ఎస్ఐఆర్ గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిజాయితీగా జరిగే విధంగా మా వారియర్స్‌కు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఓట్ల దొంగతనం జరుగుతూ ఉంటే ఏ విధంగా అడ్డుకోవాలో మా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని, కేంద్రంలో బీజేపీ ఓట్లనే కాదు సీట్లను కూడా దొంగతనం చేసేందుకు సిద్ధ మవుతోందని ఆరోపించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్‌యాదవ్

కేంద్రంలో బీజేపీ పాలనపై దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు నిరాశ చెంది ఉన్నారని, రాబోయే రోజుల్లో బీజేపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, స్థానిక కాంగ్రెస్ నేతలు అంజిరెడ్డి, గుర్రం శంకర్, మాజీ కార్పోరేటర్ వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యాన్ని సామాన్యుడికి చేర్చిన మహనీయుడు ద్వానా శాస్త్రి : ఆచార్య కొలకలూరు ఇనాక్

చిక్కడపల్లి జూన్ 15 ( ప్రభాతవార్త ) : సాహిత్య చరిత్రను సామాన్యులకు సైతం అర్థమయ్యేలా అందించడంలో చేసిన కృషి అనన్యసామాన్యమైనదని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరు ఇనాక్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభ లోని కళా సుబ్బారావు కళావేదికలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయగాన సభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సాహిత్య సవ్యసాచి, విమర్శకులు, కళాప్రవీణ డాక్టర్ ద్వానాశాస్త్రి 79వ జయంతి సందర్భంగా తెలుగు రథం సంపాదకులు కొంపెల్ల శర్మకి ప్రతిష్టాత్మక కిన్నెరద్వానా శాస్త్రి కి అందజేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ద్వానా శాస్త్రి రచించిన తెలుగు సాహిత్యంలో హాస్యామృతం ద్వితీయ ముద్రణ గ్రంథాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆచార్య కొలకలూరు ఇనాక్ మాట్లాడుతూ డాక్టర్ ద్వానా శాస్త్రి సామాన్య పాఠకుడికి కూడా తెలుగు సాహిత్యాన్ని సులభంగా పరిచయం చేసిన గొప్ప సవ్యసాచి అని అన్నారు. సాహిత్య చరిత్రను క్లిష్టత లేకుండా, సరళమైన శైలిలో అందించడం ఆయన




తెలుగు రథం సంపాదకులు కొంపెల్ల శర్మ కి ప్రతిష్టాత్మక కిన్నెర..ద్వానాశాస్త్రి స్మారక పురస్కారం ప్రధానం చేస్తున్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరు ఇనాక్

ప్రత్యేకత అని అన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా పాలకవర్గ సభ్యులు జి.వల్లీశ్వర్, త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్దన మూర్తి, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, ప్రముఖ రచయిత్రి శైలజామిత్ర, ద్వానా శాస్త్రి కుమారుడు ద్వాదశి శశికాంత్ ,ఈ కార్యక్రమంలో కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : ఎంపి ఈటల రాజేందర్

అల్వాల్, జూన్ 15 ప్రభాతవార్త: విద్యుత్ షాక్‌తో దుర్మరణం పాలైన బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఎంపి ఈటెల రాజేందర్ పరామర్శించారు. అల్వాల్ టెలికాం కాలనీలో శనివారం తెల్లవారు జామున విద్యుత్ షాక్‌తో తండ్రి కూతురు మరణించడం జరిగింది. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందే విమర్శలు వెల్లువెత్తాయి. బాధిత కుటుంబ సభ్యులను కలిసిన ఎంపి తన ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటంబాన్ని పోషించే పెద్ద చని పోతే ఆర్థికంగా పరిస్థితి దయనీయంగా ఉంటుందని ఈటెల ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు సందీప్ తల్లి క్యాన్సర్ రోగి కావడం గమనించాల్సి న విషయమని తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన వారికి 25లక్షలు చొప్పున ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత మృతుడి భార్య శ్వేతపై ఉన్న నేపధ్యంలో ఆమెకు జిహెచ్ఎంసి పరిధిలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరా ట్రిప్ కావాల్సి ఉన్నా అలాగే సరఫరా కొనసా



బాధిత కుటుంబ సభ్యులతో ఎంపి

గడం విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిదర్శమని తెలిపారు. ఘటనకు బాధ్యులైన అధికారులుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్యరెడ్డి, శ్రీనివాస్ వర్మ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి నేతలు అజయ్ రెడ్డి, మురళీక్రిష్ణ, సంజయ్, రాజిరెడ్డి, సుజాత, కరుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్యానికి కళా మాధ్యమాలు దోహదం : పి.వి. శ్రీనివాసరావు

చిక్కడపల్లి జూన్ 15 ( ప్రభాతవార్త ) మ్యాజిక్ , మిమిక్రి, మైము కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, విజ్ఞానం , సామాజిక చైతన్యాన్ని పెంపొందించే శాస్త్రీయ సంప్రదాయ కళా మాధ్యమాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో త్యాగరాయ గానసభ, ఆనంద లహరి, హైదరాబాద్ మెజిషియన్స్, భవిరి ఆర్ట్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 3ఎంఖి (మాజిక్, మిమిక్రి, మైము) పేరుతో వారం రోజుల పాటు జరిగే సప్తాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న అవార్డు గ్రహీత జి.వి.ఎన్. రాజును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజు మి మిక్రీ కళను సామాజిక రుగ్మతలపై ప్రచారానికి అద్భుతమైన మాధ్యమంగా వాడుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమ నిర్వాహకుడు మల్లం రమేష్ మాట్లాడుతూ.. నేరెళ్ల వేణుమాధవ్ మరియు మానసిక శాస్త్ర విశ్లేషకుడు బి.వి. పట్టాభిరామ్ సంస్మరణార్థం ఈ వారం రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలతో



కార్యక్రమంలో పాల్గొన్న మిమిక్రి కళాకారులను సత్కరించిన దృశ్యం

పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొంటారని తెలిపారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ, కళాకారుల ప్రతిభా ప్రదర్శనకు తమ వేదిక ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నటుడు జెన్నీ, రామదుగు వసంత్, భవిరి శివ తదితరులు పాల్గొన్నారు. పూణేకు చెందిన ఆరేళ్ల బాలుడు సాయివేద ప్రదర్శించిన మాజిక్ షోతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం పలువురు కళాకారులు ప్రదర్శించిన మాజిక్, మిమిక్రి, మైము ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.

## సిఎం ప్రత్యేక శ్రద్దతో సర్కారు బడుల్లో పౌష్టికాహారం : రామకృష్ణారెడ్డి

నార్సింగి, జూన్ 15 ప్రభాతవార్త : సర్కారు బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పౌష్టికాహారంను అందజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు " ముఖ్యమంత్రి అల్పాహారం" పతకంను ప్రారంభించారు. విద్యార్థులకు ఇడ్లీలు, వడలు, బోండాలు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్కారు బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యాబోధనను అందిస్తూనే, విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచుకునేందుకు కసరత్తు ప్రారంభించిందన్నారు. ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రి స్నాక్స్ అందిస్తున్నారని తెలిపారు. ఈ పతకాల వలన విద్యార్థులు లంచ్‌బాక్స్ తీసుకు రావాల్సి న తిప్పలు తప్పుతుందని, పోషకాలు ఎక్కువగా ఉండే బలమైన ఆహార పదార్థాలు లభిస్తున్నాయన్నారు. అలాగే విద్యార్థులకు నోటు పుస్త



మణికొండలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహారంను పంపిణీ చేస్తున్న మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి

కాలు, అకాడమిక్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చిందని వివరించారు. పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, ఏర్పుల కుమార్, గంగాధర్, శివగంగ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 17,18 తేదీల్లో ఎల్ఐఏఎఫ్ఐ జనరల్ బాడీ మీటింగ్

హైదరాబాద్,జూన్ 15,ప్రభాతవార్త: భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల అసోసియేషన్ (లియాఫీ-1964) జాతీయ జనరల్ బాడీ, ఏజెంట్స్ అసోసియేషన్ సమావేశాలు ఈ నెల 17, 18 వ తేదీలలో హైదరాబాద్ నాగోల్ లో గల శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించ నున్నట్లు జాతీయ అధ్యక్షులు శ్యామల చక్రవర్తి, సెంట్రల్ సెక్రటరీ జనరల్ ఎస్ బి శ్రీనివాస చారి, అడ్వైజరీ కమిటీ అధ్యక్షులు సింగారపు శ్రీనివాస్, సౌత్ సెంట్రల్ జోన్ ప్రెస్ పబ్లిసిటీ అధ్యక్షులు కటకం కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈసమావేశానికి భారత దేశ వ్యాప్తంగా 3500 మందికి పైగా రిజిస్ట్రేషన్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈసమావేశానికి జాతీయ నాయకులు పాలసీ దారుల సమస్యలు, ఏజెంట్ల సమస్యల పట్ల జరుగుతున్న అన్యాయాలు, భవిష్యత్ కార్య




సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

చరణ సంబంధించి పాలు కీలక నిర్ణయాలు తీర్మానించడం జరుగుతుందని అలాగే ఏజెంట్ల ప్రయోజనాలు కాపాడాలని భీమా విధానాలను ప్రోత్సహించడం, దేశీయ భీమా రంగ అభివృద్ధికి తోడ్పడమే లక్ష్యంగా ఎల్ఐఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ ప్రెస్ పబ్లిసిటీ అధ్యక్షులు షేక్ షాజహాన్, హైదరాబాద్ అధ్యక్షులు కె.సుదర్శనం సెక్రటరీ జనరల్ గుడే శ్రీనయ్య, సికింద్రాబాద్ డివిజన్ కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించండి

### - సమావేశంలో ట్రాఫిక్ డిసిపి, జెడ్సి

చాంద్రాయణగుట్ట, జూన్ 15, ప్రభాతవార్త : ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, చార్మినార్ జోనల్ కమిషనర్ కె. సత్యనారాయణలు అభిప్రాయపడ్డారు. సోమవారం నిర్కి పూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసి చార్మినార్ జోన్ కార్యాలయంలో ట్రాఫిక్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, అర్బన్ బయోడైవర్సిటీ, విద్యుత్, జలమండలి, రెవెన్యూ, హైడ్రా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఆయా విభాగాల అధికారులు తమ పరిధిలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా రోడ్లపై ఏర్పడిన గుంతలు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, జీబ్రా క్రాసింగ్, రోడ్లపై నిలిపిన పాత వాహనాలు, వివిధ పనుల కోసం తవ్వి వదిలేసిన రోడ్లు, ట్రాఫిక్ సమస్యలను వివరించారు. అనంతరం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ పలు పోలీసుస్టేషన్ల నుండి అందిన ఫిర్యాదులను ఆయా విభాగాలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రోడ్లపై వదిలేసిన చెట్ల కొమ్మల తొలగింపు, సిగ్నల్స్ వద్ద వెలిసిపోయిన జీబ్రా లైన్లకు రంగు వేయటం వంటి పనులు చేపట్టాలన్నారు. నల్గొండచౌరస్తా, మలక్‌పేట్, సైదాబాద్, చార్మినార్, దారుల్‌షిఫా, ఎంజీబీఎస్, ఆజంపురా, సంతోష్‌నగర్ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు సూచించిన విధంగా రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, రోడ్లపై పేరుకుపోయిన మట్టిదిబ్బల తొలగింపుకు, గుంతలమయంగా మారిన రోడ్లకు తక్షణమే మరమ్మత్తులు, నిర్మా




వివిధ విభాగాల అధికారులతో సమావేశమైన జెడ్సి సత్యనారాయణ, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

ణ పనులు చేపడతామన్నారు. భారీ వర్షాలకు వరద సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు తమ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రతిరోజు నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో చార్మినార్, బండ్లగూడ, సైదాబాద్ మండలాల తహసిల్దార్లు నిహారిక, ప్రవీణ్ కుమార్, మణిపాల్ రెడ్డి, యాకుత్‌పురా, మలక్‌పేట్, సంతోష్‌నగర్, మూసారంబాగ్, చార్మినార్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ఇంకేషఫ్‌అలీ, భాస్కర్‌రెడ్డి, సుభాష్‌రావు, మంగతయారు, సరిత, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ ఇందిరాదేవి, యుబిడి డిడి దేవజ, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఎడి డాక్టర్ వివేకానంద్, జలమండలి డిజీఎంలు అజ్మత్ ఆలీ, కృష్ణమోహన్, చార్మినార్, మీర్‌చౌక్, ఛత్రినాక, మలక్‌పేట్, సైదాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు శేఖర్, రాంబాబు, సంతోషం, భాస్కర్, సత్యనారాయణ, ఈఈ యాదగిరి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు-పరిష్కారాలపై జాతీయ సదస్సు

సంజీవరెడ్డి నగర్, జూన్ 15, ప్రభాతవార్త:

గిరిజనుల సాధికారత, అభివృద్ధి లక్ష్యంగా గోపాల్‌రావు ఠాకూర్ స్మారక సమితి, సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవి ద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో "గిరిజనుల సమస్యలు- పరిష్కారాలు" అనే అంశంపై సోమవారం జాతీయ సదస్సు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల గిరిజనుల సమస్యలు, అభి వృద్ధి అవకాశాలపై ప్రత్యేకంగా చర్చలు జరిపారు.ఈ కార్యక్ర మానికి మాజీ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, సిహెచ్ విద్యా సాగర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా ఎన్. రాంచందర్ రావు , పి.వి.ఎన్. మాధవ్, సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వై.ఎల్. శ్రీనివాస్, వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ జాతీయ ఉపాధ్యక్షుడు హెచ్.కె. నాగు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.సదస్సులో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ గిరిజన సమాజాల అభివృద్ధి, వారి సంస్కృతి పరిరక్షణ, విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలు, జీవన ప్రమాణాల మెరుగుదలపై విస్తృతంగా వివరించారు. గిరిజనులు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ కె. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 35 గిరిజన తెగల సామాజిక, సాంస్కృతిక జీవన విధానాలపై తాను చేసిన అధ్యయనాలను వివరించారు. గిరిజన సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఆధునిక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.ఈ సందర్భంగా గిరిజన అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, కుల సంఘాల నాయకులను ఘనంగా సన్మానించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ చేతుల మీదుగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి. చరణ్ సింగ్‌కు శాలువా కప్పి సత్కరించారు.గిరిజనుల సమస్యల పరిష్కారం, సాధికారత, సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు.



గిరిజన అధ్యాపకులు,పరిశోధకులకు సన్మానం చేస్తున్న దృశ్యం

# రంగారెడ్డి రైజర్స్ జట్టు ఇదే..



రంగారెడ్డి రైజర్స్ జట్టు వివరాలు ప్రకటిస్తు సంతకాలు చేసిన బ్యాట్‌ను చూపుతున్న యాజమాన్యం

జూబ్లీహిల్స్, జూన్ 15, ప్రభాతవార్త:

టీజీ 20-2026 సీజన్‌కు సిద్ధమవుతున్న రంగారెడ్డి రైజర్స్ ఫ్రాంచైజీని యాజమాన్యం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ప్రణవ గ్రూప్, డా. సాయిసువీర్ రెడ్డి సంయుక్త యాజమాన్యంలో ఉన్న ఈ జట్టుకు తనయ్ త్యాగరాజన్ కెప్టెన్‌గా, నితిన్ సాయి యాదవ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. అభినయ్ కుమార్ హెడ్ కోచ్‌గా, సలాం మహ్మద్ బవాష్ టీమ్ మెంటర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. టీజీ20 లీగ్‌లో భాగంగా రంగారెడ్డి రైజర్స్ తమ హోమ్ మ్యాచ్‌లను ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆడనుందన్నారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్ తెలుగు, జియోహాట్‌స్టార్ వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రణవ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ బి. రవికుమార్ మాట్లాడుతూ తొలి సీజన్ కోసం అన్ని అంశాల్లో సమగ్ర ప్రణాళికతో సిద్ధమయ్యామని తెలిపారు. సహ యజమాని డా. సాయిసువీర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ క్రికెట్ అభివృద్ధికి, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడమే తమ దీర్ఘకాల లక్ష్యమన్నారు. కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ మాట్లాడుతూ పోటీలో రంగారెడ్డి జిల్లాకు గౌరవం తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. అభిమానులకు చేరువయ్యేలా సీజన్ మొత్తం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫ్రాంచైజీ వెల్లడించింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్‌ఏలది కీలకపాత్ర



చార్మినార్,జూన్ 15 ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో జరుగుతున్న ఎస్ఐఆర్‌లోబిఎల్ఎలది చాలా కీలకమైన పాత్ర అని రాష్ట్ర కాంగ్రెస్ కమిటి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు.బహదూర్‌పుర నియోజక వర్గం దేవిబాగ్‌లోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం జరిగింది.టిపిసిసి ట్రైనర్లు నియమించిన డాక్టర్ ఎంఎస్ అన్సారీ కార్యక్రమంలో పాల్గొని బిఎల్ఎల భాధ్యతలను విపులంగా వివరించారు.ఈ సందర్బంగా పులిపాట రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు ,కార్యకర్తలు,నాయకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా,బహదూర్‌పుర నియోజకవర్గం కోఆర్డినేటర్ భావని త్రివేది,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇక్బాల్,జబ్బార్,తిరుపతి చంద్రశేఖర్,బాను చందర్ యాదవ్,జ్యోతి శెట్టి,ఫయాజ్,నసీర్,ఫారూఖ్,జలీల్ పాల్గొన్నారు.

## స్పా కేంద్రంపై దాడి.. ఏడుగురిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, జూన్ 15, ప్రభాతవార్త:

నిబంధనలకు విరుద్దంగా కొనసాగుతున్న ఒక స్పా కేంద్రంపై పంజాగుట్ట పోలీసులు దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేటలోని లాల్‌బంగ్లా ప్రాంతంలో ఉన్న ఏపిటి ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్‌పై దాడులు చేయగా నిబంధనలకు విరుద్దంగా కొనసాగుతున్నట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు లేకపోవడం, రిజిస్టర్ నిర్వహణలోపం, వైద్యులు, ఫిజియోథెరపిస్టులు లేకపోవడం తదితర అంశాలను పోలీసులు గుర్తించారు. యజమాని భానుప్రకాశ్‌తోపాటు రిసిప్షనిస్టు పూజ, థెరపిస్టులు ఫాతిమా, శైలజ, జయమ్మ, అనూషలతోపాటు కస్టమర్లు వరుణ్ అగర్వాల్, మహమ్మద్ ఒమర్‌లను గుర్తించారు. యజమాని పరారీలో ఉండగా మిగిలిన వారిని అదుపులోకి తీసుకొన్నారు. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

కార్వాన్, జూన్15(ప్రభాతవార్త) గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన షేక్ మహబూబ్ అలియాస్ మసూద్ చండి 26 హత్య కేసును టోలిచౌకి ఏసీపీ సయ్యద్ ఫయాజ్ పర్యవేక్షణలో గోల్కొండ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బృందం 13న నలుగురు నిందితులను గుర్తించి భాగస్వాములైన 4 నిందితులను అరెస్ట్ చేశారు.ఏ1గా షేక్ జాహెద్ 28,ఏ2గా జీషన్ నవాబ్ 30,ఏ3గా ఆమెర్ నవాబ్ 26,ఏ4గా నఫీజ్ సుల్తానా 48 లను అదుపులోకి తీసుకొని,హత్యకు ఉపయోగించిన వస్తువులు దాడికి ఉపయోగించిన జిమ్ ఇనుప రాడ్,కత్తి లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టారు.కోర్టు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ సందర్భముగా ఏసీపీ మాట్లాడుతూ..హత్యకు ప్రేమ వివాహం కారణమన్నారు.

## కిరాణా దుకాణంలో రూ.4 లక్షల చోరీ కేసు ఛేదన

### ఇద్దరు నిందితులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

పేట్ బషీరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త

గోదావరి హోమ్స్ కమాన్ సమీపంలోని ఓ కిరాణా దుకాణంలో జరిగిన భారీ చోరీ కేసును పేట్‌బషీరాబాద్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఐ అజయ్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం కర్నూలుకు చెందిన మనది ఆచారి (21) ఇటీవల స్రవంతి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన యువరాజు (23)తో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం వీరిద్దరూ మారేడుపల్లిలోని వడ్డెర బస్తీలో నివాసం ఉంటున్నారు.ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి గోదావరి హోమ్స్ కమాన్ పక్కన ఉన్న పూజ కిరాణా దుకాణం షట్టర్‌ను ఎత్తి లోపలికి ప్రవేశించిన నిందితులు, దుకాణంలో ఉన్న సుమారు రూ.4 లక్షల నగదు, సిగరెట్ బాక్సులను అపహరించారు.మరుసటి రోజు దుకాణ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు సోమవారం వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.దర్యాప్తులో మనది ఆచారి, యువరాజ్ ఇద్దరూ పాత నేరస్తులని పోలీసులు వెల్లడించారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

## రికవరీ మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

కార్వాన్, జూన్15(ప్రభాతవార్త) గోల్కొండ పోలీస్ జోన్ పరిధిలోని కులుసుంపుర పోలీస్ స్టేషన్ సిబ్బంది సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ అప్లికేషన్ ద్వారా వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న 30 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి రికవరీ చేశారు.ఈ సందర్భముగా కులుసుంపుర పోలీస్ స్టేషన్ ఏసిపి వి.తిరుపతి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గోల్కొండ జోన్ అడిషనల్ డెప్యూటీ కమిష నర్ ఆఫ్ పోలీస్ బి.కృష్ణ గౌడ్ పాల్గొని రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశారు.తాము పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి,తిరిగి అప్పగించినందుకు బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ హైదరాబాద్ సిటీ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మొబైల్ ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన అధికారులు,సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రశంసించారు.

## రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా వినోద్ కుమార్



ప్రమాణస్వీకారం చేస్తున్న తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం (ట్రేటా) నూతన కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు గౌడ్ తదితరులు

**మలక్ పేట, జూన్ 15,ప్రభాతవార్త:**

తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పిఎస్ వినోద్ కుమార్ నియమితులయ్యారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఎస్ నరసింహారావు గౌడ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా జె శ్రీనివాస్ గౌడ్, అసోసియేట్ అధ్యక్షులుగా బాలచంద్రం, ఏం. వెంకటయ్య గౌడ్, రామచంద్రారెడ్డి, కిష్టయ్య, ధనుంజయ, ప్రభాకర్ రావు, ఉపాధ్యక్షులుగా అనిరుద్రారెడ్డి, మృత్యుంజయ స్వామి, డేవిడ్ ఫ్రాన్సిస్, లక్ష్మీనారాయణ, నాగరాజ్, తిరుపతయ్య గౌడ్, బాల బ్రహ్మానందం తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు గౌడ్ లు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రేటా మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా పూరి వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఆనందమూర్తి, ట్రేట ఫైనాన్స్ కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ దారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ట్రేటా రాష్ట్ర సంఘం ఎన్నికల అధికారిగా జగన్మోహన్ గుప్తా ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు.

## కుటుంబానికి జీవన పోషణధారం కల్పించడమే లక్ష్యం : డైరెక్టర్ లయన్ మాణిక్ రెడ్డి



నిరుపేద కుటుంబానికి కుట్టుమిషన్లు అందిస్తున్న దృశ్యం...

**కుషాయిగూడ జూన్ 15,ప్రభాతవార్త**

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడు కుటుంబానికి వ్యవస్థ మెరుగుపడుతుందని లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320 సి డైరెక్టర్ సర్వీస్ అడ్వైజరీ లయన్ మాణిక్ రెడ్డి గూడూరి పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా బైంసా మండల్ మహాదేవ్ గ్రామానికి చెందిన పుష్పలత అనే వితంతువు కుటుంబం ఆర్థిక దుర్భర స్థితిలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న మాణిక్ రెడ్డి పుష్పలతకు ఆర్థిక చేయూతను పెంపొందించే కొట్టు మిషిన్ ను అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది కుటుంబాలకు కుట్టు మిషన్లు అందించి జీవనాధారాన్ని కల్పించడం జరిగిందన్నారు. నిరుపేదలను ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి మిగులుతుందని మానవసేవనే మాధవసేవ అని పేర్కొన్నారు. భర్త చనిపోయి నా పుష్పలతకు కిడ్నీ పాడైన కొడుకు హర్షవర్ధన్ గుండె వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తమ దృష్టికి రావడం జరిగిందని వెంటనే స్పందించి తగిన సహాయమందించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేష్ వార్డు సభ్యులు విశ్వనాథ్ గజ్జరాం శంకర్ వీరాజీ సాయినాథ్ లు పాల్గొన్నారు.

## కాప్రా ఎస్ఆర్ఓ సీనియర్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఎస్ఆర్ఓ పై ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**కుషాయిగూడ జూన్ 15, ప్రభాతవార్త**

అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్న కాప్రా సబ్ రిజిస్టర్ సీనియర్ అసిస్టెంట్ లపై చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు లక్ష్మణ్ గౌడ్ పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా ఎస్ ఆర్ ఓ కార్యాలయంలో జరుగుతున్న అక్రమ సంపాదన అక్రమ పనులు విషయమై ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాప్రాలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కాసులు లేనిదే ఏ పని చేయడం లేదని సరైన డాక్యుమెంట్లు లేకున్నా కాసులు కొట్టు పని ఇట్లే చేపట్టు అనే విధంగా అనేక అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎస్ ఆర్ ఓ సీనియర్ అసిస్టెంట్ ల విచ్చలవిడి అక్రమ సంపాదన విషయమై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిచ ఆందోళన చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో నాదం గౌడ్ , వెంకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ధృవపత్రాల పరిశీలన




**తుర్కయంజాల్, జూన్ 15, ప్రభాతవార్త**

ఆదిభట్ల సర్కిల్15 జీహెచ్ఎంసీ తుర్కయంజాల్ తొర్రూరు డివిజన్ పరిధిలో ఎస్సీ, మైనార్టీ, కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకాల కింద ద్విచక్ర, త్రిచక్ర వాహనాల మంజూరుకు సంబంధించిన లబ్ధిదారుల ధృవపత్రాల పరిశీలన కార్యక్రమం జూన్ 17న ఉదయం 11 గంటలకు రాగన్నగూడ వార్డ్ ఆఫీసులో నిర్వహించనున్నట్లు అధికారులు తెలియజేశారు.ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో వివిధ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హతలను నిర్ధారించేందుకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ పథకం కింద ఒక ద్విచక్ర వాహనం, మైనారిటీ కార్పొరేషన్ పథకం కింద ఒక ద్విచక్ర వాహనం మరియు ఒక త్రిచక్ర వాహనం మంజూరుకు ఎంపికైన లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ దరఖాస్తుల్లో సమర్పించిన వివరాల కు సంబంధించిన అసలు ధృవపత్రాలను పరిశీలన కోసం తీసుకురా వాల్సి ఉంటుంది.కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఇతర సంబంధిత ఒరిజినల్ పత్రాలు మరియు వాటి జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని అధికారులు తెలిపారు.

## 18న వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభం : చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి

**మలక్ పేట, జూన్ 15,ప్రభాతవార్త:**

వనమహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా విజయవంతం చేయాలని, ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని టీజీఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం-2026 కార్యక్రమం ఈ నెల 18వ తేదీన ఘనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని బీఎన్ రెడ్డి నగర్, సాగర్ రోడ్డులోని గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించేందుకు టీజీఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి డిఎఫ్ఓ రోహిత్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి ట్రాఫిక్ ఏసిపి నవీన్ రెడ్డి, వనస్థలిపురం ఇన్ స్పెక్టర్ రవిబాబు, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి అర్బన్ ఫారెస్ట్ పార్కును సందర్శించారు. కార్యక్రమ నిర్వహణ, మొక్కల నాటే ప్రదేశాలు, వేదిక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం ద్వారా పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, గడ్డిఅన్నారం ఎఎంసిడైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, నాయకులు మెరుగు రమేష్ రెడ్డి, వినయ్ పటేల్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



బీఎన్ రెడ్డి నగర్ సాగర్ రోడ్డులోని గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ పార్కును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి తదితరులు

## ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు...

**-ఫిట్నెస్ లేని 25 వాహనాలపై కేసులు నమోదు...**

**.తుర్కయంజాల్, జూన్ 15, ప్రభాతవార్త**

ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూరు డివిజన్ మన్నెగూడలో సోమవారం రవాణా శాఖ ఆర్టీఏ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలకు విద్యార్థులను తరలిస్తున్న బస్సులు, వ్యాన్లు మరియు ఇతర విద్యార్థి రవాణా వాహనాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మరియు అవసరమైన పత్రాలు లేని మొత్తం 25 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఆర్టీఏ ఇంచార్జ్ అధికారి అమర్‌నాథ్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యాలు ప్రతి వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బీమా, పర్మిట్ తదితర అనుమతి పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అలాగే వాహనాల్లో అత్యవసర నిష్క్రమణ ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వంటి భద్రతా పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులను తీసుకెళ్లే డ్రైవర్లు, అటెండర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లను వినియోగించరాదని హెచ్చరించారు. ఆర్టీఏ కార్యాలయంలో స్కూల్ బస్సు డ్రైవర్లకు ప్రత్యేక రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రోడ్డు భద్రతా నియమాలు, ప్రమాదాల నివారణ చర్యలు, విద్యార్థుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సునీత, రాముల నాయక్, అరుణ, రాఘవులు, శ్రీలక్ష్మి, సంపత్ గౌడ్, బాలకృష్ణ, శివప్రసాద్,పాల్గొన్నారు.




## భక్తుల కొంగుబంగారం గడ్డిఅన్నవరక్షేత్రం

**-నేత్రపర్వంగా కొలువుదీరిన శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి**



శ్రీవీర వెంకటసత్యనారాయణస్వామి

**ఎల్.బి.నగర్, జూన్ 15 ప్రభాతవార్త:** గడ్డిఅన్నవరం క్షేత్రం దిల్‌సుఖ్‌నగర్‌లో కొలువుదీరిన శ్రీవీర వేంకటసత్య నారాయణస్వామి దేవాలయంలో స్వామి వారి వ్రతం చేసుకుంటే తమ కోరికలు తీరుతాయని అశేష భక్తుల విశ్వాసం. సత్యదేవుని ఆలయంలో కొలువుదీరిన సత్యనారాయణస్వామి గడ్డిఅన్నవర క్షేత్రంగా బాసిల్లుతోందని ఇక్కడి సత్య నారాయణస్వామి కోరిన కోరికలు తీర్చే స్వామిగా ప్రఖ్యాతి ఉందని భక్తులు ఇక్కడికి వ్రతమాచరించేందుకు స్వామిని దర్శించుకునేందుకు ప్రతిరోజు పెద్దఎత్తున తరలి వస్తారు. ఐదున్నర అడుగుల విగ్రహ రూపంలో నేత్రపర్వంగా కొలువుదీరిన సత్యనారాయణ స్వామికి ఏడాది పొడవునా పూజలు, వ్రతాలు జరుగుతూ ఉండడం విశేషం. 1999లో కంచి పీఠానికి అనుబంధంగా ఈఆలయ అంకురార్పణ చేయడం జరిగింది. శ్రీకంచి పీఠాధిపతులు శ్రీజయంద్రసరస్వతి, శ్రీవిజయేంద్రసరస్వతి పవిత్ర పూజలు నిర్వహించి స్వామివారి విగ్రహం ప్రతిష్ఠాపన చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు శ్రీకంచిపీఠం ఆధ్వర్యంలో ఈ ఆలయం నిత్యపూజలతో విరాజిల్లుతుంది. వ్రతాలు జరుపుకునే దంపతులకు దేవస్థానం వారే నామమాత్ర రుసుముతో పట్టువస్త్రాలు, స్వామివారి వెండి విగ్రహం, పూజాసామాగ్రి, ప్రసాదం అందజేస్తారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాలు, ధనుర్మాసంలో తిరుప్పావై గోదాకళ్యాణం వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం, పూజలు, 6 ద్వారల ఏర్పాటు, 7 ద్వారం పరామపద ద్వారము ద్వారా దైవ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకుంటారు. ఉగాది పంచాంగ శ్రవణం, శ్రీరామనవమి రోజున సీతారాములకళ్యాణం, సంక్రాంతి పండుగ రోజున, గోదా రంగనాథుల స్వామి వారి కళ్యాణం, ఏకాదశి, పౌర్ణమి, కార్తీకమాసంలో ప్రతిరోజు వ్రతాలతో ఈ ఆలయం కిటకిటలాడుతుంది. పౌర్ణమి, ఏకాదశి ప్రతి మాసాలలో వ్రతాలు జరుపుకునే భక్తులకు దేవాలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తారు. విద్య, సంతానం, కళ్యాణం, ఆరోగ్యం కోసం భక్తులు ఇక్కడ వ్రతమాచరిస్తారు. తెలంగాణలో మరో అన్నవర క్షేత్రంగా దేవాలయం బాసిల్లుతోంది. కాగా దేవాలయంలో ఈనెల 30వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాలయం దేదీప్యమానంగా రూపుదిద్దుతున్నారు. ఆరు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

## మలక్ పేట అక్బర్‌బాగ్‌లో స్వల్ప విషయంపై వివాదం

**-పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చిన పోలీసులు**

**మలక్ పేట, జూన్ 15, ప్రభాతవార్త:**

స్వల్ప విషయంపై వివాదం తలెత్తి ఉద్రిక్తత పరిస్థితికి దారితీసిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వేగవంతంగా స్పందించి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్ బాగ్ లోని ఓ దేవాలయం సమీపంలో ఓ వర్గం వారు బట్టలు ఆరవేయడాంతో దేవాలయం కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తి ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. దీంతో సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు ఓ వర్గం వారికి మద్దతుగా నిరసనకు దిగారు సమాచారం తెలియడంతో సౌత్ జోన్ డిసిపి కిరణ్ కరే, ఏసిపి రాజా వెంకటరెడ్డి, ఠాకూర్ సుఖదేవ్ సింగ్, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారిలు సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డిసిసి కిరణ్ కరే మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుతో చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని, సంఘటనకు బాధ్యులైన నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. వదంతులు, పుకార్లు నమ్మవద్దని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవాలయం వద్ద భారీ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి కిరణ్ కరే, చిత్రంలో ఏసిపి రాజా వెంకటరెడ్డి, ఠాకూర్ సుఖదేవ్ సింగ్, ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి

## ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం విజయవంతం

**వనస్థలిపురం. జూన్.15.ప్రభాతవార్త :** సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సీతారామాంజనేయ ఫంక్షనాల్లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం మల్లాస్ న్యూరో క్లినిక్ నుండి సామ రంగారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిజెపి సీనియర్ నాయకులు గంగం ప్రేమ్‌నాథ్ ఆహ్వానం మేరకు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ స్థాపకులు మరియు ఎల్బీనగర్ ఎన్నికల ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, మాజీ కౌన్సిలర్ నీళ్ల అంజన్ కుమార్ గౌడ్, తడక మల్ల విజయ్ కుమార్, మరియు సీనియర్ నాయకులు బొమ్మ రఘురాం నేత హాజరైయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరం అనేది సమాజ సంక్షేమనికి స్వచ్చందగా సేవ చేయడం అన్నారు. ఈ వైద్య శిబిరలా ద్వారా సాధారణ వ్యాధి నమూలాలను గుర్తించి దీర్ఘకాలిక ఆరోగ్య దొరణలను పర్యవేక్షించడానికి ఉపయోగ పడుతుందన్నారు.పేద ప్రజల అనారోగ్యలకు అక్కడికక్కడే చికిత్స అందజేస్తున్న మల్లాస్ న్యూరో క్లినిక్ యాజమాన్యానికి వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీధర్ రావు, సోషల్ మీడియా కన్వీనర్ కొండం మహేందర్ రెడ్డి , సీనియర్ నాయకులు కిషోర్ , భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు పండ్యాల శివశంకర్ గౌడ్ , మయ్యర్ నాగేష్ , మ్యగని నరసింహ, నట్వ సునీల్ రెడ్డి, రాచకొండ నివాస్, మురళి, విజయ్ కుమార్, గుణగంటి మహేష్ గౌడ్ , పోతరాజు సిద్దేశ్వర్ , మైనార్టీ నాయకులు అక్బర్, సినియర్ నాయకులు చిత్రంజన్, బిజెవైఎం ప్రెసిడెంట్ సురేష్, బిజెవైఎం అఖిల్, సాయి శ్రీరామ్, గంగం చందు , తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో సామ,లచ్చిరెడ్డి, ప్రేమ్ నాథ్.

## రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, జూన్ 15, ప్రభాతవార్త:**

రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట, ఓల్డ్ మలక్ పేట్ ,సలీం నగర్ మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో మహేష్ నవమిని పురస్కరించుకుని సలీంనగర్ లో నిర్వహించిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం, ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చెకొలేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా రక్తదానం గొప్పదని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ మైత్రి నగర్‌లో గతంలో కుట్టు శిక్షణ పొందిన మహిళల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఒక గొప్ప అవకాశమన్నారు. దీని వల్ల మహిళలు స్వయం ఉపాదితో పాటు ఉపాది పొందే అవకాశం కలుగుతుందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంభన సాధిస్తే సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక పీకో మిషన్‌ను అందజేశారు. లింగోజిగూడ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు పగిడిమర్రి తిలక్‌రావు తన వంతు సహాయంగా మరో పీకో మిషన్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ట్రైనర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా గొప్పదానం అన్నదానం




అన్నదానం చేస్తున్న భగవాన్, రవి ముదిరాజ్

**సైదాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి చైర్మన్ భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా చంపాపేటలోని నల్లపోచమ్మ ఎర్రపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి చైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 38 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ విభాగం అధ్యక్షుడు రవి ముదిరాజ్, టింగ్లికార్ రాజేష్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్, ఆడేళ్ల రాజు, అండేకార్ వెంకటేష్ పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ



అన్న ప్రసాదం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జూన్ 15 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు సాంబ పాండుగుప్త ఆధ్వర్యంలో సోమవారం మోహన్ నగర్ లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఐవిఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో అన్నదానానికి విశిష్ట స్థానం ఉందని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం పట్ల అభినందించారు. మానవసేవా సేవా దుఃఖప్రదంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎందరికో ఆదర్శమన్నారు. ప్రజాసేవ లక్ష్యంగా సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను తాను నిరంతరం కొనసాగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మనిమాల, మిరుదిడ్డి శైలజ, అర్చన, నలిని, రమేష్ , శ్రవణ్ కుమార్ వెంకటేశ్వర్లు, నగేష్ , బొనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: డిసిపి



సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

**వనస్థలిపురం, జూన్ 15 ప్రభాతవార్త :**

రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో, వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎల్.బి. నగర్ డీసీపీ అనురాధ సూచించారు. సోమవారం ఆమె లాఅండ్ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాటర్ లాగింగ్ ప్రాంతాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సమస్యాత్మక ప్రాంతాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, వనస్థలిపురం సీఐ రవి బాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రజలకు అవగాహన కల్పించాలి:భారత్ వాస్



సమావేశంలో మాట్లాడుతున్న భారత్ వాస్

**ఎల్.బి.నగర్, జూన్ 15 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని భారత్ వాస్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఎస్ఐఆర్ సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత్ వాస్ తో పాటు బండారి భాస్కర్ హాజరై ఎస్ఐఆర్ యొక్క ప్రాముఖ్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో కార్యకర్తలు, బిఎల్ఓ సభ్యుల పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాడ అనితరెడ్డి, నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ పాల్గొని పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా బిఎల్ఏ-2 సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి స్టేడియంలో 'రగ్బీ ప్రీమియర్ లీగ్ '



బాల్ ఆవిష్కరిస్తున్న మహిళ,పురుషుల జట్ల కెప్టెన్లు

**హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త:**

హెచ్ఎస్‌బిసి రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ప్రారంభానికి ముందు అధికారిక బాల్ ఆవిష్కరణ కార్యక్రం ఘనంగా ఆవిష్కరించింది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో 10 జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు ఈ వేడుకలో రగ్బీ ఇండియా అధ్యక్షుడు లీగ్ కమిషనర్ రాహుల్ బోస్, జిఎంఆర్ స్పోర్ట్స్ సుజోయ్ గంగూలీ కూడా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో పురుషుల జట్ల కెప్టెన్లు ఢిల్లీ రెడ్జ్ కెప్టెన్ పాట్రిక్ ఒడాంగో, హైదరాబాద్ హీరోస్ కెప్టెన్ మాన్యుయేల్ మొరెనో, కోల్‌కతా బంగా టైగర్స్ కెప్టెన్ రికార్డో డ్యుయార్టే, చెన్నై బుల్స్ కెప్టెన్ శాంటియాగో అల్వారెజ్, ముంబై డ్రీమర్స్ కెప్టెన్ ఇంపి విస్సర్, బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్ కెప్టెన్ ఎన్‌గరోహి మెక్‌గార్వేబ్లాక్ హాజరుకాగా... మహిళల జట్ల తరపున ఢిల్లీ రెడ్జ్ కెప్టెన్ ఈడెన్ కిల్‌గోర్, కోల్‌కతా బంగా టైగర్స్ కెప్టెన్ షినిక్వా లాంప్రెక్ట్, చెన్నై బుల్స్ కెప్టెన్ చాంటెల్లే మీల్, ముంబై డ్రీమర్స్ కెప్టెన్ అబిగేల్ బ్రౌన్ లు హాజరయ్యారు. కాగా బాల్ ఆవిష్కరణకు ముందు రాహుల్ బోస్ తెలంగాణ రగ్బీకి చెందిన 6 మంది అబ్బాయిలు 6 మంది అమ్మాయిలతో కలిసి రగ్బీ ప్రైమర్ నిర్వహించారు.

## బోనాల పండుగకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**-జోనల్ కమిషనర్‌కు మాధవరెడ్డి,సుధాకర్‌గౌడ్‌లు వినతి**




**అత్తాపూర్ జూన్15, ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సీనియర్ నాయకులు మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్ లు జోనల్ కమిషనర్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం జోనల్ కార్యాలయం లో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని సీనియర్ నాయకులు మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్ లు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాబోయే బోనాల పండుగకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బుద్వేల్ రైల్వే స్టేషన్, నేతాజీ నగర్, శ్రీరామ్ నగర్, వెంక టేశ్వర కాలనీలలో సిసి రోడ్డు, వీధి దీపాలు, డ్రైనేజీ, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని.అదేవిధంగా అమ్మవారి ఆలయాల ప్రాంగణంలో శానిటేషన్‌తో పాటు అధ్వానంగా ఉన్న రోడ్లకు సిసి రోడ్డు పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారుల కు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

## దాతలు స్పందించినప్పుడే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

**అత్తాపూర్ జూన్ 15,ప్రభాతవార్త :**




దాతలు స్పందించినప్పుడే ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చెందుతుయని రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో అత్తాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విషిత ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, ఫౌండర్ ఇషిత ఆధ్వర్యంలో పాఠశాల అవసరాలకు సంబంధించి విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడానికి ఒక హ్యాండ్ వాష్ నిర్మాణం, 20 కుర్చీలు, 10 క్లాస్ రూమ్ టేబుల్స్ అందించారు.సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత దాతలకు అభినందనలు తెలియజేశారు. తదనంతరం అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. సమాజంలో బడి ,గుడి అభివృద్ధి సాధించాలంటి దాతలు ముందుకు వచ్చినప్పుడు మాత్రమే సాధ్యమవుతుందని విషిత ఫౌండేషన్ వారి సహకారాన్ని కొనియాడారు, కార్యక్రమంలో ఇషిత ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, పాఠశాల శ్రేయోభిలాషి కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి గారు, ఇషిత ఫౌండేషన్ సభ్యులు లక్ష్మయ్య, రామయ్య, పిఆర్‌టియు రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస సాగర్, పాఠశాల ఉపాధ్యాయులు రజియా బేగం, సాయిప్రసాద్ రావు, రంగారెడ్డి, సుజాత, రోజారాణి,జకీరా బేగం, జ్యోతి, హేమలత,పద్మావతి, సురేష్, కమలమ్మ, కవిత,కృష్ణవేణి,సరిత పాల్గొన్నారు.